క్లుప్తంగా

వైద్య ఖర్చులకు సాయం

కోట: కోటకు చెందిన షిరిడీ సాయి అక్షయ సేవా సమితి సహకారంతో శ్యాంసుందరపురానికి చెందిన షేక్ జరీనా వైద్యం కోసం సాయం అందించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జరీనా నిరుపేద కావడంతో సేవా సమితి సాయం కోరింది. స్పందించిన సేవా సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య శనివారం కోటలో రూ.10వేల సాయం అందజేశారు. కోటేశ్వరరెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

రూ.5లక్షలు స్వాధీనం


తహసీల్దార్‌కు నగదు అప్పగిస్తున్న పోలీసులు

సైదాపురం: మండల కేంద్రం సమీపంలోని చెక్ పోస్టు వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.5లక్షల నగదు పట్టుబడింది. అయితే మండలంలోని గనిలో పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు ఈ నగదు తీసుకువస్తున్నట్లు సదరు వ్యక్తులు చెప్పారని ఎస్‌ఐ డీఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. అయినప్పటికీ నగదును తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో సీజ్ చేసినట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న నగదును ట్రెజరీలో అప్పగించనున్నట్లు వివరించారు.

22న చేపల చెరువుల వేలం

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని చేపల చెరువులను 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈనెల 22న వేలం పాటలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అమ్మవారిపేట, చెవిరెడ్డిపల్లి, పెరియవరం, మరాటపల్లి, మనులాలాపేట, కుమ్మరగుంట, ధర్మాపురం, పోలిశెట్టి గుంట చెరువులకు సంబంధించి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5వేల ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొన్నాలని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి


సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

కలువాయి: వేసవిలో మండలంలో తాగునీటికి ఎద్దడి లేకుండా చూడాలని ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా తాగునీరు, ఉపాధి పనులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల పనితీరుపై చర్చించారు. కార్య క్రమంలో మండలాధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు, బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పెంచల నరసారెడ్డి, తహసీల్దార్ లీలా సంజీవ కుమారి, ఎంపీడీఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

క్షయవ్యాధితో జాగ్రత్త వహించాలి


మాట్లాడుతున్న బంగారుపేట వైద్యులు

వెంకటగిరిరూరల్: క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని పట్టణంలోని బంగారుపేట పీహెచ్‌సీ వైద్యులు శివకృష్ణారెడ్డి, జినిత తెలిపారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా పట్టణంలోని బంగారుపేటలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

పాతకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

పట్టణంలోని పాతకోట పీహెచ్‌సీ వైద్యశాల వైద్యులు ఎం.రాజేష్ క్షయవ్యాధి నివారణ కార్యక్రమాలు చేపట్టారు. పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి పాతబస్టాండ్ వద్ద మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. సూపర్‌వైజర్ బి.నాగేశ్వరరావు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం


మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రముని


అవగాహన కల్పిస్తున్న స్వీప్ నోడల్ అధికారి కాంచన

గూడూరురూరల్: ప్రజాస్వామ్య దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికి భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని, ప్రభుత్వాలను ఎన్నుకునేందుకు ఓటే వజ్రాయుధమని స్వీప్ గూడూరు నియోజకవర్గ నోడల్ అధికారి, ఎంఈఓ కాంచన అన్నారు. గూడూరు పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో శనివారం సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం(స్వీప్) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాంచన మాట్లాడుతూ విద్యార్థులు ఓటు విలువ తెలుసుకుని తమ తల్లిదండ్రులు, బంధువులకు అవగాహన కల్పించాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా కృషిచేయాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడిని ఎన్నుకునేలా స్వేచ్ఛగా ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా మోటివేషన్ చేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఫారం–6 ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దఫా ఎన్నికల్లో ఎన్నికల సంఘం 85 సంవత్సరాలు నిండిన ఓటర్లు, 45 శాతం వైకల్యం ఉన్న వారికి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్ మురళి, శివకుమార్, రవి, బీఎల్‌ఓ శివకుమార్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై దృష్టి సారించాలి

సూళ్లూరుపేట రూరల్: మే నెలలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఎటువంటి సమస్యలు లేకుండా శాంతి భద్రతలపై అధికారులు దృష్టి సారించాలని ఎన్నికల ఆర్వో, ఆర్డీఓ చంద్రముని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మేలో నిర్వహించనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు నియోజకవర్గస్థాయిలో డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి సమక్షంలో అన్ని ఏఈఆర్వోలు, పోలీసులతో శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తుండడంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా శాంతి భద్రతలపై ఎక్కువగా దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పోలీసులతో పాటు ఎన్నికల సిబ్బంది తిరిగి నిర్భయంగా ఓటు వేసేవిధంగా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ గోపాల కృష్ణ, సీఐ మధుబాబు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

వాకాడు: మండలంలోని అన్ని మతాల పెద్దలతో శనివారం అధికారులు ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ నరసింహారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నందున చర్చి, మసీదు, దేవాలయాల్లో ఎలాంటి రాజకీయ సమావేశాలు జరపరాదన్నారు. అలాగే రాజకీయ నాయకుల ప్రలోభాలకు మతపెద్దలు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీనాథ్, ఆర్‌ఐ సెల్వ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో మహిళలకు ప్రాధాన్యం


మహిళా నేతలతో మాట్లాడుతున్న నేదురుమల్లి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు అధిక పాధాన్యత ఇస్తూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని 8వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకురాలు జలగం కామాక్షి ఆధ్వర్యంలో పలువురు మహిళలు శనివారం నేదురుమల్లి నివాసానికి చేరుకుని వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా రామ్‌కుమార్‌రెడ్డిని ఖరారు చేయడంపై శాలువ, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలలో మహిళలకు ప్రాధాన్యతను కల్పిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మహిళలు అంతా ఏకమై వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషిచేసి అత్యధిక మెజారిటీ వెంకటగిరి నియోజకవర్గంలో సాధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని తెలియజేశారు. మహిళా నేతలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ తులసిజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ఇంగ్లిషు మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి ఆన్‌లైన్ ప్రారంభమవుతున్నట్లు తెలియజేశారు. ఎటువంటి ఫీజులు లేకుండా కార్పొరేట్‌కు దీటుగా చక్కటి విద్యను అందిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలయాల్లో ప్రచారం నిషేధం


మత పెద్దలతో మాట్లాడుతున్న అధికారులు

చిల్లకూరు: ఎన్నికల కోడ్ తప్పక పాటిస్తూ వివిధ మతాల పెద్దలు అధికారులకు సహకారం అందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లోని హిందూ దేవాలయాల అర్చకులు, మసీదులకు చెందిన మత పెద్దలు, చర్చిలకు సంబంధించిన పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత పెద్దలు ఆలయాలు, చర్చిలు, మసీద్‌లలో ఎన్నికల ప్రచారం లేకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ భానుమూర్తి, ఆర్‌ఐ రమ్యస్వాతి, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న నేదురుమల్లి

- ఎన్నికల కార్యాచరణపై నేదురుమల్లి దిశా నిర్దేశం

వెంకటగిరి(సైదాపురం): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో శనివారం వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి వైఎస్సార్‌సీపీ నేతలతో సమీక్షించారు. నేదురుమల్లి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో అధికారుల నిబంధనలను అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బహిష్కృత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వెంకటగిరిలో చీకటి రాజకీయాలు చేస్తున్నారని దీంతో పార్టీ నేతలు ఆయన మాయమాటల్లో పడి పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం త్వరలోనే ప్రారంభిస్తామని తమ తల్లి మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కూడా తనతోపాటు ప్రచారంలో పాల్గొన్ననున్నట్లు వివరించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై అళఘునాథుడు



గూడూరురూరల్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అళఘునాథస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజైన శనివారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో తిరుచ్చి, సాయంత్రం ఊంజల్ సేవలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా శేషం భాస్కర్‌రావు, పద్మావతి, డాక్టర్ మైథిలి, ఎల్.వి.రమణబాబు, నాగేశ్వరరావు, పద్మావతి, శ్రీనివాస ప్రశాంత్ వ్యవహరించారు.

కలువాయిలో పోలీస్ కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, పారామిలటరీ బలగాలు

కలువాయి: ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి ఆధ్వర్యంలో పారా మిలటరీ, పోలీసు బలగాలు మండలంలోని పలుగ్రామాల్లో శనివారం పోలీస్ కవాతు నిర్వహించారు. రాపూరు సీఐ సుబ్రహ్మణ్యం, కలువాయి ఎస్‌ఐ అయ్యప్ప పారామిలటరీ, పోలీసు బలగాలతో కలిసి కలువాయి, తెలుగురాయపురం, తిరుమలపాడు, దాచూరు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా మనోధైర్యం నింపేందుకు కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎక్కువ కేసులు నమోదైన వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి అనూష

వెంకటగిరిరూరల్: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండి జీవితంలో రాణించాలని వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి ఓ అనూష పేర్కొన్నారు. వెంకటగిరిలోని జ్యోతిరావు పూలే గురుకుల బాలుర పాఠశాలలో శనివారం న్యాయవిజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి అనూష మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని సూచించారు. గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహకాలు అందిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. హక్కుల పరంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఇబ్బందులకు గురవుతుంటే మండల లీగల్ సర్వీసు కమిటీకి రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. న్యాయవాదులు రాజారాం, రాజేష్, అనుపమ్మ, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

పనులు చేసిన ఆనవాళ్లు ఉన్నాయి


కూలీలను విచారిస్తున్న ఏపీడీ

చిల్లకూరు: ఉపాధి హామీ పథకంలో యంత్రాలను వినియోగించి పనులు చేస్తున్నారని 'ఉపాధి పనుల్లో యంత్రాల వినియోగం' అనే కథనం సాక్షిలో శనివారం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన ఉపాధి ఏపీడీ వరప్రసాద్‌రావు పని జరిగే ప్రాంతాన్ని పరిశీలించి కూలీల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పని జరిగే ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలించారు. అక్కడ యంత్రాలతో పనులు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఈ మేరకు ఉపాధి కూలీలు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను జిల్లా ఉపాధి పీడీ శ్రీనివాసప్రసాద్‌కు పంపిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఉపాధి జేఈ మల్లికార్జున్, ఉపాది సిబ్బంది ఉన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

తడ: వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతిచెందాడు. ఎస్‌ఐ నరశింహారావు తెలిపిన వివరాల మేరకు. శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో బ్రాంచ్ మేనేజర్‌గా నిని చేస్తున్న హర్యానాకు చెందిన మంగేరామ్(56). ఇతను తడలో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 16 తేదీన విధులు ముగించుకుని తడకు బయలు దేరాడు. శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా సూళ్లూరుపేట నుంచి చెన్నై వెళుతున్న ద్విచక్రవాహనం అతనిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు హుటాహుటిన శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తొలుత తమిళనాడులోని రెడ్‌హిల్స్ అనంతరం చెన్నై జీజీహెచ్‌కి తరలించారు. వారం రోజుల పాటు చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: మండలంలోని కురుగొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ముమ్మారెడ్డి ఇందిరమ్మ, వైఎస్సార్‌సీపీ నేత అనీల్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శనివారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ముమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి మృతిచెందారు. ఈక్రమంలో ప్రభాకర్‌రెడ్డి పార్థివదేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించి అంతిమయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, చెంగాళమ్మ దేవస్థానం బోర్డు చైర్మన్ బాలచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, కన్వీనర్ హరనాథ్‌రెడ్డి ఉన్నారు.

యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తి


నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

గూడూరురూరల్: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ స్ఫూర్తి యువతకు ఆదర్శమని, ఆయన ఆశయాలను కొనసాగించాలని సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ అన్నారు. గూడూరులోని సీపీఎం కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నేతలు వెంకటరామిరెడ్డి, పుట్టా శంకరయ్య, సీఐటీయూ నేతలు సురేష్, పామంజి మణి, చంద్రయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

సూళ్లూరుపేట: స్వాతంత్య్ర పోరాటంలో ప్రాణాలర్పించిన విప్లవయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని శనివారం సూళ్లూరుపేట సీపీఐ కార్యాలయంలో జరుపుకున్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత్ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో వర్ధంతిని జరుపుకున్నారు. విప్లవ యోధులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఐ నేత సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ సేవలు చిరస్మరణీయం

వెంకటగిరిరూరల్: స్వాతంత్య్ర సమరంలో రాజీలేని పోరాటం సాగించి భగత్‌సింగ్ అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రతిఒక్కరూ ఆయన బాటలో పయనించాలని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.అజిత పేర్కొన్నారు. స్థానిక కాళహస్తి శేషయ్య స్మారక గ్రంథాలయం వద్ద భగత్‌సింగ్ 93వ వర్ధంతి నిర్వహించారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీవీ.రమణయ్య, జిల్లా నేత తిరుపాల్ పాల్గొన్నారు.

ఇంటింట వైఎస్సార్‌సీపీ ప్రచారం


ఓట్లను అభ్యర్థిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

కలువాయి: కేశమనేనిపల్లిలో వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్ రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీ విభేదాలు చూడకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అమలు చేసిన జగనన్నను మరో మారు ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తి, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడిని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ ఎంపీ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ఆర్.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షుడు పి.పెంచల నరసారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్ రఫీ, సర్పంచ్ సంకల కృష్ణ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ


మాట్లాడుతున్న రాజేశ్వరి

బాలాయపల్లి (డక్కిలి): చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం, బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి లియోనా తెలిపారు. శనివారం గొట్టికాడు ఎస్సీ కాలనీలో పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పోషక వంటకాలను ప్రదర్శించారు. సీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, సీహెచ్‌ఓ నీరజ, హెల్త్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఏఎన్‌ఎం సుబ్బమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సుమతి, శ్యామల పాల్గొన్నారు.

పోషకాహారాన్ని తీసుకోవాలి

రాపూరు: గర్భిణులు, చిన్నారులు, బాలింతలు అధికంగా ఉండే పోషక పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. పెనుబర్తి, గోనుపల్లిలో శనివారం పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, చిన్నారులు, బాలింతలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ క్షేమం

సైదాపురం: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని సూపర్‌వైజర్ రాధిక అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార పక్షోత్సవాలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఒక్కొక్కరికి ఇప్పటివరకు ఇస్తున్న పాలు, గుడ్డు, రాగిపిండి, శనగచిక్కి, బెల్లం బాలామృతం పంపిణీ చేస్తున్నారన్నారు. అనంతరం వైద్య సిబ్బంది సమక్షంలో ప్రత్యేక పరీక్షలతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

ముగిసిన పోషన్ పక్వాడ

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహిస్తున్న పోషన్ పక్వాడ కార్యక్రమం శనివారంతో ముగిసినట్లు సీడీపీఓ శంషాద్‌బేగం పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం, మనులాలాపేట, చెవిరెడ్డిపల్లి, ధర్మాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో ముగింపు కారక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ వెంకటగిరి సెక్టార్ పరిధిలో 15 రోజుల పాటు పోషన్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించామని మహిళలకు ఆరోగ్యకరంగా అంశాలు, తీసుకోవాల్సిన పోషక విలువలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. సెక్టార్ పరిధిలో సంపూర్ణ ఆరోగ్యకరంగా ఉన్న మహిళలను గుర్తించి సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణవేణి, కల్పలత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారమే ఆరోగ్యం

చిల్లకూరు: ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబి సూచించారు. రామారెడ్డిపాళెం, ఉడతావారిపాళెం అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ఆదినారాయణమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు మునికుమారి, మానస, కస్తూరమ్మ, నిర్మలమ్మ పాల్గొన్నారు.

కండలేరులో 8.409 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం 8.409 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 480 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 115, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైజ్ఞానిక సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో సృజన 2కే24 వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత

దొరవారిసత్రం: మండలంలోని నెలబల్లి వద్ద జాతయ రహదారిపై అక్రమంగా తమిళనాడుకు మినీ వ్యాన్‌లో తరలిస్తున్న 4వేల కేజీల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య మాట్లాడుతూ పట్టబడిన రేషన్ బియ్యం విలువ సుమారు రూ.1.44 లక్షలు ఉంటుదని వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడిలో విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణనాయక్ పాల్గొన్నారు.